

హత్యకేసులో ఆరుగురికి యావజ్జీవం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఓ హత్య కేసులో ఆరుగురికి యావజ్జీవ కారగార శిక్ష విధిస్తూ అనంతపురం జిల్లా కోర్టు జడ్జి జి.శ్రీనివాస్ మంగళవారం నాడు తీర్పును వెలువరించింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మండల పరిధిలోని బడన్నపల్లి గ్రామానికి చెందిన చెన్నారెడ్డి 2017వ సంవత్సరం డిసెంబర్ 17వ తేదీన హత్యకు గురయ్యాడు. ఈ ఘటనపై ధర్మవరం రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. కేసుకు సంబంధించి గంగాధర్, సూర్యనారాయణ, పెద్దన్న, శివయ్య, నాగరాజు, ప్రసాద్‌లను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అనంతపురం సెషన్స్ కోర్టు నిందితులు హత్యలో పాలుపంచుకున్నట్లు నిర్ధారిస్తూ వారికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించింది. కాగ తీర్పు వెలువడగానే నిందితుల కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. వారిని సబ్‌జైలుకు తరలిస్తున్న సమయంలో కన్నీటి పర్యవంతం అయ్యారు.



బాలోత్సవ పోస్టర్‌ను విడుదల చేస్తున్న బాలోత్సవ కమిటీ నాయకులు

27, 28, 29న అనంత బాలోత్సవం

◆పిల్లల పండుగను జయప్రదం చేద్దాం

◆అనంత బాలోత్సవ కమిటీ గౌరవాధ్యక్షురాలు షమీమ్ షఫీఉల్లా

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంత బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో జనవరి 27, 28, 29వ తేదీల్లో మూడు రోజుల పాటు అనంతపురం ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అనంత బాలోత్సవాలను జయప్రదం చేయాలని బాలోత్సవ కమిటీ గౌరవాధ్యక్షురాలు షమీమ్ షఫీఉల్లా పిలుపునిచ్చారు. మంగళవారం నాడు నగరంలోని క్రిసెంట్ స్కూల్ ఆవరణంలో ఆ కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో మేధస్సు, సృజనాత్మకతను వెలికితీసేందుకు అనంత బాలోత్సవాలను నిర్వహించడం అనవాయితీగా వస్తోందన్నారు. ఈ క్రమంలో భాగంగా ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిత్యం పాఠ్యాంశ పుస్తకాలతో కుస్తీ పడుతూ ఆటపాటలకు దరూమవుతున్న నేపథ్యంలో పిల్లల్లో దాగి ఉన్న సజనాత్మకతను వెలికి తీయడానికి, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడానికి అనంత బాలోత్సవం చక్కటి వేదికగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరై మహనీయుల వేషధారణ, ప్రదర్శనలు, నాటకం, ఆటలు, పాటలు, క్విజ్, సైన్స్‌ఎగ్జిబిషన్, వ్యాసరచన, క్విజ్, నతప్రదర్శనల్లో పాల్గొనవచ్చున్నారు. విద్యార్థులు చక్కటి ప్రతిభ చూపేందుకు బాలోత్సవం ఓ వేదికగా నిలుస్తుందని తెలిపారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. పాఠశాలల యాజమాన్యం, అధికారులు సహకరించి బాలోత్సవాలు జయప్రదం చేయాలని కోరారు. అనంత బాలోత్సవ కమిటీ నాయకులు, న్యాయవాది పద్మజ మాట్లాడుతూ అనంత బాలోత్సవాలు పిల్లలకు ఎంతో దోహదపడుతున్నాయని తెలిపారు. లలితకళాపరిషత్ తరుపున న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తూ తగిన సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. అనంత బాలోత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సావిత్రి, శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటికే బాలోత్సవాలకు సంబంధించి ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాట్లు చేసున్నట్లు తెలియజేశారు. విద్యార్థులు, పాఠశాలల యాజమాన్యాలు ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనంత బాలోత్సవ కమిటీ సభ్యులు డాక్టర్ ప్రసూన, రామాంజినమ్మ, లక్ష్మి, హసీన, పరమేష్, సురేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

బాలికల అభివృద్ధికి చేయూత

బాల్య వివాహాలను నియంత్రించాలి - మంత్రి ఉషశ్రీ చరణ్



బాలికాదినోత్సవ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

బాలికలు అన్ని రంగాల్లో పురోగతి సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం చేయూతను అందిస్తోందని మంత్రి ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ పెళ్లి వద్దు... చదువే ముద్దు.. అనే నినాదంతో బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని పిలుపునిచ్చారు. చదువుతోనే బాలికల భవిష్యత్తు బాగా ఉంటుందని తెలియజేశారు. రాష్ట్రంలో బాలికల ఉజ్వల భవిష్యత్తుకు కోసం ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి బాలికల భద్రతకు గొప్ప భరోసా కల్పిస్తున్నారు. రాష్ట్రంలో బాలికలపై ఎటువంటి వేధింపులు, లైంగికదాడులు జరగకుండా బాల్యవివాహాలను పూర్తిగా అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వ చట్టాలతో పాటు జగనన్న ప్రభుత్వం పటిష్ఠమైన చర్యలు చేపట్టిందని తెలియజేశారు. దిశ చట్టాన్ని తీసుకొచ్చి బాలికలకు మరింత రక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబంలో బాలికల భవిష్యత్తు కోసం ప్రతి ఇంట్లో ఆడపిల్లలను గౌరవించాలని తల్లిదండ్రులకు సూచించారు. మగపిల్లలతో సమానంగా వారిని పెంచాలన్నారు. అనంతరం బాలిక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పతిభ కనపరచిన బాలికలకు బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం

వాహనదారులు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవని మంత్రి ఉషశ్రీ చరణ్ సూచించారు. జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ద్విచక్రవాహనం నడిపి రోడ్డు భద్రత, నియమాలపై అవగాహన కల్పించారు. ప్రాణం చాలా విలువైనదని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. అనంతరం వారోత్సవాలపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరచిన వారికి బహుమతులను అందజేశారు.



◆రేపటి నుంచి సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం

◆ఆందోళనలో ఫ్లెక్సీల తయారీ దారులు

◆ప్రత్యామ్నాయం చూపాలంటున్న తయారీదారులు

జీవనంపై నిషేధం..!

ప్రజాశక్తి-హిందూపురం

గత రెండు దశాబ్దాల నుంచి డిజిటల్ బ్యానర్ల వాడకం విరివిగా పెరిగింది. పట్టణం, పల్లె అన్న తేడా లేకుండా అన్ని చోట్లా వీటినే వాడుతున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ అందంగా ఉండడం వల్ల ఫ్లెక్సీలకు అనతికాలంలోనే డిమాండ్ పెరిగింది. ప్రధాన నాయకులు వస్తే ఈ ప్లాస్టిక్ ఫ్లెక్సీలు ఆ ప్రాంతంలో దగద గలాడు తుంటాయి. వినియోగం పెరగడంతో చాలా మంది ఈ రంగంలోకి వెళ్లి అందులో స్థిరపడ్డారు. పట్టణాల్లో ఫ్లెక్సీల తయారీ, ప్రింటింగ్ ఒక పెద్ద ఉపాధి రంగంగా మారింది. చాలా మంది బ్యాంకుల్లో ఋణాలను తీసుకుని ప్లాస్టిక్ బ్యానర్ల తయారీ యంత్రాలను పెట్టుకుని ఉపాధి పొందుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు 100 పైగా ఫ్లెక్సీ సెంటర్‌లు ఉన్నాయి. వీటిపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ప్రస్తుతం ప్లాస్టిక్ బ్యానర్ల తయారీ నిషేధంతో వీరంతా ఉపాధికి దూరం అయ్యే ప్రమాదం ఏర్పడింది.

ఉపాధిపై దెబ్బ

ఫ్లెక్సీ సెంటర్లలో ఒక్కో దాంట్లో 10మంది దాకా వర్కర్లు ఆధారపడి జీవిస్తున్నారు. యజమానులు ఒక్కొక్కరు రూ.10లక్షలు అంతకంటే ఎక్కువ ఖర్చు చేసి యంత్రాలను ఏర్పాటు చేసుకున్నారు. బ్యాంకుల్లో రుణాలు తీసుకుని వచ్చే ఆదాయంలో కంతులకు కట్టుకుని, ఇతరులకు ఉపాధి కల్పిస్తూ వారి కుటుంబాలనూ పోషించుకుంటున్నారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం ఫ్లెక్సీ ప్రింటింగ్‌లను ఆపే యాలని నిర్ణయం తీసుకోవడంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయం చూపకుండా ఇలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయం చూపించే వరకు తమకు అవకాశం ఇవ్వాలని డిమాండు చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణలో భాగంగా గురువారం నుంచి సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధంను అమలు చేయనుంది. ఇందుకోసం గతేడాది జీవో నెంబర్ 65, 75లను తీసుకొచ్చారు. జీవోకు సంబంధించిన ఉత్తర్వులు ఈ నెల 26వ తేదీ నుంచి కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది. దీంతో ఎక్కడా ప్లాస్టిక్ బ్యానర్లను తయారు చేసేందుకు వీల్లేదని అధికారులు చెబుతున్నారు. ప్రత్యామ్నాయం చూపకుండా ఇలా నిర్ణయం తీసుకుంటే తమ పరిస్థితి ఏమిటని ఫ్లెక్సీలు, ఇతర ప్లాస్టిక్ వస్తువుల తయారీదారులు ఆందోళన చెందుతున్నారు. తమకు ప్రత్యామ్నాయం దొరికే వరకు సమయం పొడగించాలని కోరుతున్నారు. ప్రభుత్వం మాత్రం రేపటి నుంచి ప్లాస్టిక్‌ను పూర్తి స్థాయిలో నిషేదించాలని నిర్ణయం తీసుకుంది.

కాటన్ బట్టలతో తయారు చేయాలి

మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు

హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా ఉన్న ఫ్లెక్సీ తయారీదారులు అందరు ప్లాస్టిక్‌తో కాకుండా కాటన్ బట్టలతో బ్యానర్‌లను తయారు చేయాలి. ఇప్పటికే ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని ఉత్వర్వులు ఇచ్చింది. తయారీ దారుల కోరిక మేరకు గడువు పెంచారు. ఈ గడువూ ముగిసిన నేపథ్యంలో ఈనెల 26 నుంచి నిషేధాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నాం. దీనిని ఉల్లగించిన వారికి ఒక అడుగుకు రూ.100 చొప్పున జరిమాన విధించడంతో పాటు శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం.

ప్రత్నామ్యాయం కల్పించాలి

ఎం.ఇంతియాజ్ సిపిఎం జిల్లా కార్యదర్శి

ఫ్లెక్సీల నిషేధంపై ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఈ రంగంపై ఆధారపడి చాలా మంది నిరుద్యోగులు జీవనం సాగిస్తున్నారు. అధికారులు ప్రభుత్వం ఈ రంగం కార్మికులతో మాట్లాడాలి. వీరికి ప్రత్యామ్నాయం దొరికే వరకు ప్లాస్టిక్ నిషేధాన్ని వాయిదా వేయాలి. ఎటువంటి ప్రత్యామ్నాయ అవకాశాలు చూపకుండా నిషేధం తీసుకువస్తే ఆ రంగంపై ఆధారపడిన ఉత్పత్తిదారులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీల స్థానంలో క్లాత్ బ్యానర్లు ప్రింట్ వేసుకోవడానికి వీలుగా మిషనరీని అప్‌డేట్ చేసుకోడడానికి, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవడానికి సంవత్సరం గడువు ఇవ్వాలి. అలా కాకుండా ఒక్కసారిగా నిషేధం నిర్ణయం తీసుకుంటే దానిపై ఆధారపడిన పేద కుటుంబాలన్నీ ఇబ్బందుకలు గురవుతాయి.

పోరాటయోధుడు జెడ్.వీరారెడ్డికి నివాళి



పెద్దవడుగూరులోని సమాధి వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

పోరాటయోధులు జెడ్.వీరారెడ్డి అని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దస్తగిరి కొనియాడారు. వీరారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఆయన సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జెడ్.వీరారెడ్డి జిల్లాలో నెలకొన్న రైతాంగ సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ముఖ్యంగా జిల్లాలో సాగునీటి ప్రాజెక్టు పూర్తి చేయాలని, ప్రతి ఎకరాకు సాగునీరు ఇవ్వాలని, పంట నష్టపోయినప్పుడు నష్టపరిహారం, గిట్టుబాటు ధరలు కల్పించాలని ఉద్యమాలు సాగించారన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.

ఉచిత వైద్యశిబిరం

జడ్.వీరారెడ్డి వర్ధంతి సందర్భంగా శాంతిరాం మేజర్ కంటి వైద్యశాల సౌజన్యంతో మండల కేంద్రంలో ఏరాప్రటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కర్నూలు కంటి వైద్య నిపుణులు డాక్టర్ సుదర్శన్‌రావు హాజరై సుమారు 100 మంది దాకా పరీక్షలు నిర్వహించారు. వీరిలో 40 మందికి ఆపరేషన్లు చేయాలని సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వర్‌రెడ్డి, పెద్దయ్య, దుబ్బన్న, పెద్దన్న, వీరశేఖర్‌రెడ్డి, జి.ఓబులేసు, రమణ, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గుత్తి : ప్రజా సమస్యల పరిష్కారం కోసం కామ్రేడ్ జెడ్.వీరారెడ్డి అలుపెరగని పోరాటాలు కొనసాగించారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు వి.నిర్మల, మండల కార్యదర్శి బి.రామకృష్ణ కొనియాడారు. సిపిఎం సీనియర్ నాయకులు, రైతు ఉద్యమ నేత కామ్రేడ్ జెడ్.వీరారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని జెడ్.వీరారెడ్డి కాలనీలో చిత్రపటానికి పూలమాలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎం.కవిత, ఎన్.రేణుక, సిఐటియు మండల అధ్యక్షుడు ఎం.మల్లేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎస్.మున్ని, రైతు సంఘం నాయకుడు రాజన్న, కాలనీవాసులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్: సిపిఎం సీనియర్ నాయకులు, రైతు ఉద్యమనేత, గుత్తి సమితి మాజీ ప్రెసిడెంట్ జెడ్ వీరారెడ్డి ఆశయాలు కొనసాగిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, నగర 1వ కమిటి కార్యదర్శి వి.రామిరెడ్డి అన్నారు. మంగళవారం గణేనాయక్ భవన్‌లో జెడ్ వీరారెడ్డి 18వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామాంజినేయులు, వన్నూరప్ప తెలిపారు.

ప్రజా భద్రతలో పెద్దవడుగూరు ఆదర్శం : ఎస్పీ

ప్రజాశక్తి-పెద్దవడుగూరు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ ఫక్కీరప్ప

ప్రజా భద్రతను కాపాడటంలో భాగంగా పెద్దవడుగూరులో దాదాపు 13 సిసి కెమెరాలు ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలుస్తోందని ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి కొనియాడారు. గ్రామ పంచాయతీ నిధులు రూ.1.30 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన 13 సిసి కెమెరాలను మంగళవారం ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా భద్రతలో సిసి కెమెరాలు కీలకపాత్ర వహిస్తాయన్నారు. ఒక్కో సిసి కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. అంతేగాకుండా ఇటు ప్రజల భద్రతకు, అటు పోలీసుల విధులకు కెమెరాలు ఎంతో దోహదపడుతామన్నారు. మున్ముందు ఎలాంటి నేరం జరిగినా వాటి ఛేదింపునకు ఎంతో సహకరిస్తామన్నారు. ఇంతకు మునుపే వాణిజ్య సముదాయాలు, దుకాణాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయించామన్నారు. తాడిపత్రి పట్టణంలో ఇటీవల జరిగిన చైన్ స్నాచింగ్ కేసుల ఛేదింపులో సిసి కెమెరాల పాత్ర కీలకంగా నిలిచిందన్నారు. పెద్దవడుగూరు గ్రామాన్ని మిగతా గ్రామాలు కూడా ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సర్పంచి వరలక్ష్మి సుంకన్న, ఎంపిపి శ్రీదేవి నాగరాజు, కార్యదర్శి మురళీకృష్ణారెడ్డి, పామిడి రూరల్ సిఐ రామకృష్ణ, పెద్దవడగూరు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

సిఐటియు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు



అనంతపురంలో సిడిపిఒకు వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు, అంగన్‌వాడీల నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అంగన్‌వాడీలు, ఆయాలకు కనీస వేతనాలు రూ.26 వేలు అమలు చేయడంతోపాటు దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు వై.వెంకటనారాయణ, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వి.జమున డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అనంతపురం సిడిపిఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్ పరిధిలోని పేద గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు అంగన్‌వాడీలు సేవలు అందిస్తున్నారని తెలిపారు. అంగన్‌వాడీలకు దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పుష్పలత, సంధ్యా, పార్వతి, సింధు, హరిప్రియ, పుష్ప, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : దీర్ఘకాలికంగా పెండింగ్‌లోఉన్న అంగన్‌వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు నాయకులు జగన్మోహన్‌రెడ్డి, ఉమాగౌడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయం ముందు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు పేద గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకి అనేక సేవలందిస్తున్నారన్నారు. అలాంటి సెంటర్లలో మౌలిక వసతులు కరువయ్యాయన్నారు. కొన్ని సెంటర్లలో విద్యుత్ సౌకర్యం లేదన్నారు. విద్యుత్ సౌకర్యం ఉన్న కేంద్రాలకు ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదన్నారు. ఐదేళ్లుగా అంగన్‌వాడీలకు టిఎ, డిఎలు చెల్లించడంలేదన్నారు. ముఖ్యంగా వైఎస్ఆర్ సంపూర్ణ పోషణకు ఆరునెలలుగా బిల్లులు చెల్లించడం లేదన్నారు. దీంతో ఆ భారం అంగన్‌వాడీలపై పడుతోందన్నారు. అలాగే అంగన్‌వాడీలకు నాసిరకం ఫోన్లు అందజేసి అనేక యాప్‌లను ప్రవేశపెట్టారన్నారు. దీంతో పలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అంగన్‌వాడీలకు మానసిక ఒత్తిడి తగ్గించాలని, కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని, సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలి, 2017 సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల సాధన కోసం ఫిబ్రవరి 6న కలెక్టరేట్లు, పీడీ కార్యాలయాల వద్ద నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకురాళ్లు నాగేశ్వరమ్మ, శకుంతల, రమాదేవి, జమున, రాజేశ్వరమ్మ, శశికళ, తదితరులు పాల్గొన్నారు.



తాడిపత్రి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, అంగన్‌వాడీలు

గుత్తి : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు సిఐటియు అనుబంధ సంస్థ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షుడు ఎం.మల్లేష్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పేస్‌యాప్‌ను రద్దు చేయాలన్నారు. అలాగే ర్యాలీలు, సభలను నిషేధిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 1ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐసిడిఎస్ ఎసిడిపిఓ డిల్లేశ్వరికు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు రేష్మ, నాగరాణి, గంగాదేవి, శోభారాణి, నాగరత్న, పార్వతి, బావమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన పేస్‌యాప్‌ను రద్దు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ధర్నా చేపట్టారు. వీరి ధర్నాకు రైతుసంఘం జిల్లా నాయకుల జ్ఞానమూర్తి, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు విజయలక్ష్మి, దుర్గాదేవి, అరుణకాంతమ్మ, శశికళ, అశ్వర్థమ్మ, రామాంజనమ్మ, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతపురం : జిల్లా ప్రయివేట్ మెడికల్ లాబ్ టెక్నిషన్స్ అసోసిషన్ సభ్యులు రూపొందించిన నూతన క్యాలెండర్‌ను మంగళవారం స్థానిక కార్యాలయంలో డిఎంఅండ్‌హెచ్‌ఓ వీరబ్బాయి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రయివేట్ మెడికల్ లాబ్ టెక్నిషన్స్ అసోసిషన్ ప్రెసిడెంట్ విల్సన్, వైస్ ప్రెసిడెంట్లు ధీరజ్, నాగేంద్రప్రసాద్, సత్యనారాయణరెడ్డి, సీనియర్ అడ్వైజర్స్ రామ్మోహన్‌రెడ్డి, బి.దామోదర్‌రెడ్డి, ట్రెజరర్ చంద్రన్న, వేణుగోపాల్, శ్రీనివాసులు, ధనుంజయ, మనోజ్, కె.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే బాలికలకు బంగారు భవిష్యత్తు



గుంతకల్లులో మాట్లాడుతున్న వైద్యురాలు

ప్రజాశక్తి-గుంతకల్లు

బాలికలకు చదువు నేర్పించడం ద్వారానే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసినవారం అవుతామని వైద్యులు పత్తి హిమబిందు, సుజాత పిలుపునిచ్చారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో ఐద్వా పట్టణ కార్యదర్శి జ్యోతి అధ్యక్షత పట్టణంలోని ఎస్జెపి ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో బాలికలు కష్టపడి బాగా చదువుకోవాలన్నారు. అంతేగాకుండా బాలికలు ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారం తీసుకోవాలని, వ్యక్తిగత శుభ్రతను పాటించాలన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయరాదన్నారు. అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని, ఎవరైనా ఇబ్బంది కలిగిస్తే వెంటనే కుటుంబ సభ్యులకి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, పట్టణ కార్యదర్శి వెంకటేష్, కిషోర్, ఐద్వా పట్టణ అధ్యక్షురాలు రంగమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయిని సావిత్రి, ఉపాధ్యాయులు రంగస్వామి, పిఇటి కవిత, చందు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం ఘనంగా బాలికల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 'ఆడపిల్లను పుట్టనిద్దాం.. బతకనిద్దాం.. చదివిద్దాం.. ఎదగనిద్దాం..' అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాలికా దినోత్సవంలో వక్తలు

ఉరవకొండ : సమాజం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే బాలికల చదువు చాలా ముఖ్యమైన రాకెట్ల పిహెచ్‌సి వైద్యాధికారిణి పావని సూచించారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం చిన్నముష్టూరులో మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ ప్రశస్త కుమారి ఆధ్వర్యంలో మండల పరిధిలోని రాకెట్ల పిహెచ్‌సి వైద్య సిబ్బంది ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలికల హక్కులు వారి భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. సమాజంలో మనుగడ సాధించాలంటే బాలికలు క్రమశిక్షణతో మెలిగి బాగా చదువుకుని వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగ రంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ, సూపర్‌వైజర్ శ్రీధర్, సిబ్బంది హిమబిందు, భగవాన్ దాస్, ఇంతియాజ్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలోని రాధాకృష్ణ మున్సిపల్ పాఠశాలలో మంగళవారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బాలికలతో కలిసి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాయదుర్గం తాలూకా అధ్యక్షుడు అంజి, రాధాకృష్ణ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌నాయుడు, ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయక కార్యదర్శి కోట్రేష్, ఉపాధ్యాయులు సులోచన, పుష్పలత, రామేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఉరవకొండలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారిక విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రఘురామమూర్తి మాట్లాడుతూ దేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆదర్శంగా తీసుకుని విద్యార్థినులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అలాగే తల్లిదండ్రులు కూడా లింగ వివక్ష లేకుండా బాలికలను బాధ్యతతో చదివించాలన్నారు. ఈ మహిళా సాధికారత సమన్వయకర్త ఫరీసా, రవికుమార్, నాగమణి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బెస్తలకు రాజకీయ అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి-శింగనమల

బెస్త కులస్తులకు రాజకీయంగా అవకాశం కల్పించాలని బెస్త సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని దుర్గాంజనేయస్వామి కొండపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నాలుగు లక్షలు మంది బెస్త కులస్తులు ఉన్నారన్నారు. వారికి రానున్న సాధారణ ఎన్నికల్లో జిల్లాలో ఒక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కేటాయించి రాజకీయ గుర్తింపు ఇవ్వాలన్నారు. అలాగే మండల కేంద్రంలో బెస్త కులస్తుల ఎక్కువగా ఉన్నందున ఒక కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బెస్తసంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు రమేష్, నారాయణస్వామి, మండల అధ్యక్షుడు కృష్ణమూర్తి, గోపాల్, వెంకటనారాయణ, పాపారాయుడు, అమర్, బెస్త షేక్షావలి, బెస్త కులస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి జాతీయస్థాయి కవితా ప్రశంసాపత్రం


ప్రజాశక్తి-నార్పల



అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రానికి చెందిన కవి, రచయిత, హిందీ ఉపాధ్యాయుడు వల్లెపు వెంకట సాయినాథ్ జాతీయ స్థాయి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. హైదరబాద్‌కు చెందిన నవభారత నిర్మాణ సంఘం జాతీయ స్థాయిలో ఇటీవల నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని 'దేశభక్తి- జాగతి' అనే అంశంపై రచనా సమ్మేళనాన్ని దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఇందులో సాయినాథ్ నేతాజీపై అనిర్వచనీయమైన సూక్తులను తన పదునైన రచనా భావజాలంతో రచించి నిర్వాహకులను మెప్పించారు. ఈ మేరకు సంస్థ అధ్యక్షులు ఎస్.రవికుమార్ సాయినాథ్‌కు ప్రశంసా పత్రాన్ని ఆన్‌లైన్ ద్వారా అందించారు.

సిఐ శేఖర్‌కు సన్మానం

ఉరవకొండ : మండలంలోని రేణిమాకులపల్లి గ్రామంలో ఈనెల 17, 18వ తేదీల్లో జరిగిన మారెమ్మ దేవత గ్రామ ఉత్సవాన్ని ప్రశాంతంగా జరిగేందుకు సహకరించినఉరవకొండ రూరల్ సిఐ శేఖర్, అర్బన్ సీఐ హరినాథ్, ఎస్ఐ వెంకటస్వామిని మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సర్పంచి బోయ రామాంజనేయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేలాది మంది భక్తులు తరలి వచ్చినప్పటికీ ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతి భద్రతలను కాపాడారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ మేజర్ గ్రామపంచాయతీ 15వ వార్డు సభ్యులు వశికేరి మల్లికార్జున, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, వెలిగొండ బుషప్ప. తదితరులు పాల్గొన్నారు.


సిఐ శేఖర్‌ను సన్మానిస్తున్న రేణిమాకులపల్లి సర్పంచి రామాంజినేయులు

ఆశావర్కర్ల భర్తీకి ఇంటర్వ్యూలు

ఉరవకొండ : ఉరవకొండ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఖాళీగా ఉన్న ఆశావర్కర్ల భర్తీకి మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రాత పరీక్షతోపాటు ఇంటర్వ్యూలు నిర్వహించారు. పట్టణానికి సంబంధించి ఐదు సచివాలయాలకుగానూ 16 ఆశావర్కర్లు పోస్టులు మంజూరు కాగా 52 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వీటిలో 8 దరఖాస్తులు తిరస్కరణకు గురికాగా 44 అభ్యర్థులకుగాను 40 మంది అభ్యర్థులు హాజరయ్యారు. డీరికి కమిటీ ఛైర్‌పర్సన్, గ్రామపంచాయతీ సర్పంచి మీనుగా లలితమ్మ, పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్, డాక్టర్ సాహితీ, డాక్టర్ వినీత, లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ గణేష్‌బాబు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ లక్ష్మీనాయక్ ఆధ్వర్యంలో రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కార్యకర్తలు నిమ్మల వెంకటేష్, మోతిలాల్‌నాయక్, సచివలయం ఆరోగ్య కార్యకర్తలు సుభాషిణి,మాలశ్రీ, అర్చన, సుమలత, లక్ష్మి, పట్టణ ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమను వదులుకునే ప్రసక్తే లేదు..

ప్రజాశక్తి గుంతకల్లు

32 మంది ఉద్యమ నేతల బలిదానం, 26వేల రైతుల భూమి త్యాగాలతో స్థాపించిన విశాఖ ఉక్కు పరిశ్రమను వదులుకునే ప్రసక్తే లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 30న విశాఖలో చేపట్టనున్న మహాగర్జనకు మద్దతుగా సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద రిలే నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ప్రైవేటీకరణ ఆపాలని రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 23, 24 తేదీల్లో రెవెన్యూ డివిజన్లలో రిలే నిరసన దీక్షలు చేపట్టినట్లు తెలిపారు. ఈనెల 30న లక్షమందితో విశాఖలో మహాగర్జనకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ దీక్షలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.గోవిందు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి బి.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం

నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో నగరంలోని చంద్రబాబు కొట్టాలకాలనీలో రూ.10వేలు విలువజేసే నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఛైర్‌పర్సన్ నిర్మలామురళి మాట్లాడుతూ అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ ఆర్థికంగా సతమతమవుతున్న కుటుంబాలను ఆదుకోవడంతో నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్ ముందుంటుందన్నారు. ఇందులో భాగంగానే తమవంతు బాధ్యతగా సహాయం చేయాలని భావించి రూ.10 వేల విలువజేసే సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్వరి, మున్నా, నీలు, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న నిర్మలామురళి

మడుగుపల్లెలో నాకాబందీ


గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ వేణుగోపాల

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామమైన మడుగుపల్లెలో సిఐ వేణుగోపాల ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారుజామున నాకాబందీ నిర్వహించారు. ముందుగా అనుమానితుల ఇళ్లు, కల్లందొడ్లు, పొలాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామసభలో సిఐ మాట్లాడుతూ గ్రామస్థులు ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండాలన్నారు. ఫ్యాక్షన్ కారణంగా మీతోపాటు కుటుంబాలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పుట్లూరు ఎస్ఐ వెంకటప్రసాద్, యల్లనూరు ఎస్ఐ రామకృష్ణ, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన కల్పించాలి

రహదారి శాఖ అధికారి విశ్వనాథరెడ్డి

ప్రజాశక్తి-బెలుగుప్ప

యువతకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాయదుర్గం రహదారి శాఖ అధికారి విశ్వనాథ్‌రెడ్డి సూచించారు. భద్రత వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారుల నిర్లక్ష్యం, అవగాహనా రాహిత్యంతోనే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా యువత రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణయ్య, ఎఎస్ఐ రామదాసు, జమేదారు బాల నరసింహులు, పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రహదారి శాఖ అధికారి విశ్వనాథరెడ్డి

శాశ్వత భూహక్కు, భూ రక్షా పథకంపై సర్వే

ప్రజాశక్తి-ఉరవకొండ

జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంపై విడపనకల్ మండల పరిధిలోని పాల్తూరు గ్రామంలో సర్వే చేపట్టారు. ఇందులో భాగంగా పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, విఆర్ఓ పక్కీరప్ప పర్యవేక్షణలో గ్రామంలోని ఎస్సీ, బిసి, ఒసి కాలనీల్లో పర్యటించి గ్రామకంఠంలో ఉన్న భూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లు, స్థలాల యజమానులకు సంబంధించి హౌస్ ఓల్డ్ మ్యాపింగ్ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆయా వివరాలను నమోదు చేసుకోవడంలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లు, వీఆర్వోలు, గ్రేడ్ 5 సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం : ఇఒఆర్‌డి

నార్పల : పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహ సూచించారు. మంగళవారం మండలం పరిధిలోని బండ్లపల్లి గ్రామపంచాయతీలో చేపట్టిన పారిశుధ్యం పనులను ఇఒఆర్‌డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా సేకరించిన ఘన, వ్యర్థ పదార్థాలను సంపద తయారీ కేంద్రానికి తరలించి వర్మీ కంపోస్టు తయారు చేయడం సంతోషకరమన్నారు. అలాగే గ్రామపంచాయతీలో జరుగుతున్న జగనన్న భూహక్కు, భూరక్ష పథకం సర్వేలో పాల్గొని సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పి.వెంకటనారాయణమ్మ, పంచాయతీ కార్యదర్శి వెంకటరెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ కుళ్లాయప్ప, విఆర్‌ఓ అమరనాథరెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ రామచంద్ర, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

టిడిఎస్‌లో కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు పాటించాలి

అనంతపురం కలెక్టరేట్ : టిడిఎస్ డిడక్షన్‌లు చేసేటప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు తూచ తప్పకుండా పాటించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని కలెక్టరేట్ ఏఓ విజయలక్ష్మి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ రెవన్యూభవన్‌లో ప్రభుత్వ శాఖ డిడిఓలకు ఇన్‌కమ్ ట్యాక్స్ కార్యాలయం (టిడిఎస్) వార్డ్-1 కర్నూలు వారి ఆధ్వర్యంలో ఇన్‌కమ్ ట్యాక్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి విజయలక్ష్మి, ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్ సిఎస్.రాజశేఖర్ హాజరై టిడిఎస్‌పై వివరించారు. డిడిఓలు, సివిల్ కాంట్రాక్టర్‌లు, వాహనాలు ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్‌లకు, ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్‌లకు సొమ్ము చెల్లించేటప్పుడు డిడిక్షన్స్ ఎలా చేయాలి, ఉద్యోగులకు ఏ విధంగా చేయాలన్న విషయాలపై వివరించారు. అన్ని విషయాలను పరిశీలించుకున్న తరువాతనే డిడిఓలు ట్యాక్స్ డిడక్షన్స్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌కమ్ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ స్టాఫ్ కెవి.రంగారావు, డిడిఓలు పాల్గొన్నారు.

ఘనంగా 'దేగల' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-శింగనమల

తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ సభ్యులు దేగల కృష్ణమూర్తి జన్మదిన వేడుకలను మంగళవారం అనంతపురంలోని నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి పూలమాలలు, బొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కోసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను అందుబాటులో లేకపోయినా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దండు విజయ్‌కుమార్, శింగనమల పెద్దనాగముని, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు నరేంద్రకుమార్‌యాదవ్, జిల్లా తెలుగు యువత కార్యదర్శి చిన్న పెద్దన్న, బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి కొయ్యగూర పెద్దన్న, దేగల కిరణ్, దేగల హరీష్, వీరనారాయణ, వీరస్వామి, శ్రీనివాస్‌నాయక్, సుదర్శన్‌నాయక్, తరిమెల చిరంజీవి, మైనార్టీ నాయకుడు ఫకృద్దీన్, నార్పల నరేష్, తదితరులు పాల్గొన్నారు.


దేగల కృష్ణమూర్తిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

పెద్దవడుగూరు : మండలంలోని వీరేపల్లి 67వజాతీయ రహదారిలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డుప్రమాదంలో గుర్తుతెలియని (45) వ్యక్తి మృతిచెందినట్లు ఎస్ఐ రాజశేఖరరెడ్డి తెలిపారు. యాడికి వైపు నుంచి గుత్తివైపు వస్తున్న ఆటోను వెనుక వైపు నుంచి వాహనం ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవరు సురేష్ తీవ్రంగా గాయపడ్డారు. మృతుడి చేతికి సుకన్య అనే పేరు పచ్చబొట్టు ఉంది. బిస్కెట్ కలర్ గళ్ల చొక్కా ధరించినట్లు తెలిపారు. ఆచూకీ కనుగొనేందుకు పోలీసులకు విచారణ ప్రారంభించారు. గాయపడిన వ్యక్తిని చికిత్స కోసం గుత్తికతరలించి జరిగిన ఘటనపై కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

యాడికి : మండల కేంద్రంలోని లాలెప్ప కాలనీలో నివాసం ఉంటున్న కళావతి (22) మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యాడికిలోని ఆసుపత్రి కాలనీకి చెందిన వసంతం శ్రీనివాసులు, నాగరత్న చిన్న కుమార్తె కళావతిని ధర్మవరానికి బాలకృష్ణకు ఇచ్చి 2017లో వివాహం చేశారు. వివాహం అయినప్పటి నుంచి కళావతి, బాలకృష్ణ యాడికిలోని లాలెప్ప కాలనీలోనే మగ్గం నేస్తూ నివాసం ఉంటున్నారు. అయితే కళావతి 2021 నుంచి ఛాతి నొప్పితో భాదపడేది. ఈనేపథ్యంలో మంగళవారం జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఇంటి పైకప్పునకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించారు. మృతురాలికి కూతురు ప్రణీత, శ్రీచైతన్య తేజ్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి : పట్టణంలోని ఓ పెట్రోల్ బంక్ ఎదురుగా 44వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పెద్దవడగూరుకు చెందిన ఫణిరాజ్, రాజశేఖర్ స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంలో గుత్తికి వస్తుండగా అనంతపురం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో గాయపడ్డ ఇద్దరిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రి తరలించారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భక్త మార్కండేయ జయంతి వేడుకలు

రాయదుర్గం : భక్త మార్కండేయ స్వామి ఆలయంలో మంగళవారం మార్కండేయ జయంతి వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారికి విశేష పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తునా తరలిరావడంతో శివనామ స్మరణతో ఆలయం మారుమోగింది. ముందుగా పద్మశాలి కులస్తుల జెండాను ఆవిష్కరించారు. అనంతరం పంచామృత అభిషేకం, రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామావళి, ధ్వాజారోహనం, ప్రతేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పోరాళ్ల శిల్ప, పద్మశాలి బహుత్తమ సంక్షేమ సంఘం అధ్యక్షులు అరవ శివప్ప, గౌరవాధ్యక్షులు సోమ మల్లేశప్ప, ధర్మకర్త ముకుంద, ప్రధాన కార్యదర్శి నాగప్ప, ఉపాధ్యక్షులు పాండు, సిద్ధప్ప, వెంకటేశులు, హనుమంతు, కోశాధికారి రామచంద్రప్ప, ప్రచార కార్యదర్శి గురు రాఘవేంద్రప్రసాద్, యువజన సంఘం అధ్యక్షులు మహేష్, ఉపాధ్యక్షులు రాము, పద్మశాలి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గుత్తి : పద్మశాలీయుల ఆరాధ్యదైవం మార్కండేయ జయంతి వేడుకలు గుత్తిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య కాలనీలో ఉన్న మార్కండేయ స్వామి ఆలయంలో పద్మశాలీయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు దాసా రమేష్, ప్రధాన కార్యదర్శి దండు కృష్ణ, నాయకులు శివశంకర్, వెంకటేష్, నాగరాజు, పార్థసారథి, చలపతి, పెద్దయ్య, తిమ్మప్ప, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

పరిటాల రవీంద్రకు నివాళి

ఆత్మకూరు : పరిటాల రవి వర్థంతిని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు మాట్లాడుతూ దివంగత నేత పరిటాల రవీంద్ర అణగారిన వర్గాల కోసం ఎనలేని పోరాటాలు చేశారన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ కన్వీనరుల పిల్లల వేణుగోపాల్, సూరి నాయకులు వెంకటనారాయణ, కందుల ఓబుళళతి, రైతుసంఘం రవీంద్రారెడ్డి, మహిళా విభాగం లక్ష్మీదేవమ్మ, చెన్నమ్మ, ఆదిలక్ష్మి, ఉషారాణి, శృతి, నరసింహులు, మాజీ డీలర్ రవీంద్ర, సీనియర్ నాయకులు మనోరంజని, ఎస్సీ మల్లన్న పాల్గొన్నారు.

నార్పల : దివంగత నేత మాజీమంత్రి పరిటాల రవి వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు అలం నరసానాయుడు ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులుర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎర్రినాగప్ప, జిల్లా తెలుగు యువత చంద్రబాబు, క్లస్టర్ ఇన్‌ఛార్జి పిఎల్ లక్ష్మీనారాయణ, యూనిట్ ఇన్‌ఛార్జిలు నాగేంద్ర, నాగేష్, భక్తవత్సల, సత్యనారాయణ, విజయ్‌భాస్కర్, చంద్రమౌళి, టిఎన్‌టియుసి జాఫర్‌వలి, రామాంజినేయులు, నడిమింటి రాము, మహేష్, హరీష్, గణేష్ పాల్గొన్నారు.

26 నుంచి ప్లాస్టిక్ నిషేధం

రాయదుర్గం : ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగల్ యూస్ ప్లాస్టిక్ వస్తువులు, ఫ్లెక్సీల వినియోగంపై ప్రభుత్వం నిషేధం విధించిందని, కావున ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, స్పూన్లు, ఫోర్కులు, కత్తులు, గ్లాసులు, ట్రేలు, జెండాలు, కప్పులు, ఇయర్ బడ్లు, మిఠాయి కర్రలు, ఐస్ క్రీమ్ పుల్లలు, మిఠాయిపై చుట్టే కాగితాలు, ఇన్విటేషన్ కార్డులు, సిగరెట్ ప్యాకింగ్ పై చుట్టే ప్లాస్టిక్ కవర్లు, మొదలైనవి పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. అంతేకాక ప్లాస్టిక్ ఫ్లెక్సీలను కూడా నిషేధించామన్నారు. వీటిని ఉల్లంఘించి ఎవరైనా అమ్మినా, కొన్నా, వాడినా, నిల్వ ఉంచినా, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

గుత్తి : మండలంలోని తొండపాడు గ్రామంలో వెలిసిన బొలికొండ ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీ ఆదాయాన్ని మంగళవారం ఆలయ ఆవరణలో లెక్కించారు. ఆరు నెలల, 20 రోజులకు సంబంధించి దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ రామతులసి, ఆలయ కార్యనిర్వహణాధికారి వి.దేవదాసు సమక్షంలో లెక్కించగా రూ.9,57,077 ఆదాయం లభించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, దేవాదాయ, ధర్మాదాయ శాఖ సిబ్బంది, రామకృష్ణ, బాలమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉరవకొండ : మండల పరిధిలోని పెన్నహోబిలంలో వెలసిన సుప్రసిద్ధ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని ఆలయ ఇఒ కె.విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప కమిషనర్ హిందూ ఆలయ శాఖ కర్నూలు వారి ఆదేశాల మేరకు. ఆసక్తి కలిగిన వారు 20 రోజుల్లోపు దేవాదాయ శాఖ ఉప కమిషనర్ కర్నూల్ వారి కార్యాలయానికి దరఖాస్తులను నేరుగా పంపుకోవచ్చని తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

బెలుగుప్ప : విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని జనసేన మండల అధ్యక్షుడు కాసంశెట్టి సుధీర్, ఎఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి రాజేష్ సూచించారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. ముందుగా విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా భోజన సమయంలో మంచినీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మంచినీటితోపాటు నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రామంజి, తిప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.